స్వార్థం ఉండి, వారికి స్వార్థం ఉంటే మీరు అంటే వారుకంగారు పడతారు, వారు అంటే మీరు కంగారుపడతారు. నీకు ఎప్పుడైనా దుఃఖం వచ్చింది అనుకో. దుఃఖం ఏ నేనుకు వస్తోంది అని ప్రశ్నించుకో. అప్పుడు దుఃఖం ఆగిపోతుంది. నీకు ఎప్పుడైనా గర్వం వచ్చింది అనుకో ఈ గర్వం ఏ నేనుకు వస్తోంది అని ప్రశ్నించుకో. గర్వం ఆగిపోతుంది, ఆ నేను కూడా అణిగిపోతుంది. అంటే నీకు రెండు లాభాలు. దొంగ నేను దేహం లేకుండా ఉండలేదు. దేహం వస్తే లోకం వస్తుంది. అక్కడనుండి అన్నీ వచ్చేస్తాయి. మొత్తం సృష్టి అంతా దేహము నేను అనే ఒంటిస్థంబం మీద ఆధారపడి ఉంది. అందుచేత దానిని డౌట్‌చెయ్యి, దానిని షేక్ చెయ్యి. రామనామం చేయని నోరు, రామనామం వినని చెవులు, రాముని రూపం చూడలేని కళ్ళు అవి ఇంద్రియాలు కాదు, అవి రంధ్రాలు అన్నాడు తులసీదాసు. మీ ఇంద్రియాలను, మీ తెలివిని, భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను భగవదనుభవం పొందటం కోసం ఉపయోగించుకోండి. కొంతమందికి భగవంతుడి నామంచేయాలని ఉంటుంది. ప్రక్కవారు ఏమనుకొంటారో అనుకొంటారు. అది కూడా అహంకారమే. ప్రక్కవారు ఆక్షేపిస్తే నీకు వచ్చే నష్టం ఏమిటి? మనం తక్కువ మాట్లాడాలి. ఎక్కువగా మాట్లాడితే తగాదాలు వస్తాయి. ఎక్కువ ఆలోచన, విచారణ, భక్తి కలిగిఉండాలి. వారు అలా ఉన్నారు, వీరు ఇలా ఉన్నారు అనే గొడవవద్దు. నీవు ఎలా ఉన్నావో చూసుకొని నీలో ఉన్నచెడుగుణాలను తొలగించుకొని, పవిత్రత సంపాదించి, నిన్ను నీవు సంస్కరించుకోవటానికి ప్రయత్నించు. మనజీవితం అంతా కృత్రిమంగా ఉంది. కాని లోపల ఉన్న వస్తువు సహజంగా ఉంది, నిర్మలంగా ఉంది. అందువలననే అది మనకు తెలియటంలేదు. లోపల చెడుసంకల్పం పెట్టుకొని మంచి మాట మాట్లాడినా దానివలన ప్రయోజనం లేదు. మంచిసంకల్పంతో మంచి మాట్లాడుతూ ఉంటే నీకు ఆధ్యాత్మిక పురోగతి వస్తుంది. లోపల చెడుసంకల్పం పెట్టుకొని మాట్లాడుతూ ఉంటే రంపం పెట్టి కోసివేసినా నీకు జ్ఞానం రాదు. మనం భగవంతుడిని మోసం చేయలేము. మనస్సులో దారిద్ర్యం ఉండకూడదు. కొంతమందికి ఆర్ధికస్తోమత ఉండదు. కాని మాటలో, చూపులో, మనస్సునిండా అంతాసంపదే. లోపల సంపద ఉన్న వారిని చూస్తే మనకు జ్ఞానం కలుగుతుంది. మానసిక దారిద్ర్యం ఉన్నవాడు ఎన్నిగుళ్లు కట్టించినా, యజ్ఞాలు చేసినవాడికి జ్ఞానం రాదు, పుణ్యం వస్తే రావచ్చు అది అనుభవిస్తే పోతుంది. కొంతమందికి ఎంతధనం ఉన్నా తృప్తి ఉండదు. ఎంతో కొంత తృప్తి ఉండాలి. తృప్తిలేక పోతే మీరు సాధన చేసినా తరించరు. దేహం విడిచి పెట్టేనాటికి గాంధీగారికి ఉన్న ఆస్తి భగవద్గీత, కళ్ళకుజోడు, కాళ్ళకు జోడు, కర్ర అవే ఆయన ఆస్తి మరి మహాత్ముడు ఎలా అయ్యాడు అంటే లోపల ఉన్న స్వచ్ఛత అనే సంపద వలన ఆయన మహాత్ముడు అయ్యాడు. అదే నిజమైన సంపద.





# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-04-2002, కోడవల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగంచేసుకొంటే మరణానంతరం వెలుగుఉన్న లోకాలకు వెళతాము, భగవంతుడు ఇచ్చిన అవకాశములను దుర్వినియోగం చేస్తే మరణానంతరం చీకటి లోకాలకు వెళతాము. భగవంతుడు మనకు కొన్ని అవకాశములు ఇస్తాడు. చదువు, ధనం, అధికారం వీటిని సద్వినియోగం చేసుకోవాలి. నీవు నిష్కామకర్మను కొంతైనా ఆచరించు, స్వార్ధంలేకుండా నీవు చేయగలిగినంత పనిచెయ్యి. ఇలా నీవు పనిచేస్తుంటే ఆపనే నిన్ను రక్షిస్తుంది, ఈజన్మలోనే కాదు రాబోయే జన్మలోకూడా నిన్నురక్షిస్తుంది అని భగవంతుడు చెపుతున్నాడు. గాధల జోలికి వెళ్ళకండి, లోపలకు వెళ్ళండి, లోపలకు వెళ్ళండి అంటారు భగవాన్. వస్తువు నీలోపల హృదయగుహాలో ఉంది. బయట కనిపించే దేవతలు అందరూ దాని యొక్క నీడలుమాత్రమే. ఒక వస్తువు నీటిలో పడిపోతే నీ ప్రాణమును, ఇంద్రియాలను నిరోధించి లోపలకు మునిగి ఆవస్తువును ఎలాతెచ్చుకుంటున్నారో అలాగ నీ మనస్సును ఉపసంహరించి హృదయగుహాలో మునగాలి. మనస్సును లోపలకు పంపటానికి సాధన అవసరం. చేపనీటి ప్రవాహమునకుఎలా ఎదురీదుతుందో అలాగ నీమనోప్రవాహమునకు ఎదురీది మనోమూలంలోనికి వెళ్ళాలి. మనోమూలంలోనికి వెళ్ళి అక్కడ స్థిరపడితే ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. కర్త ఈశ్వరుడే ఆయన స్వతంత్రుడు. అందువలన మనం ఆయనను ఆశ్రయించాలి. ఆయన Birthless, Deathless. ఆయనను ఆరాధించటం వలన ఆస్థితిని మనకు అనుగ్రహిస్తాడు. నీకు దేహము, మనస్స తెలుస్తున్నాయి కదా వీటిని లోపల ఉన్న భగవంతుడిని తెలుసుకోవటాని ఉపయోగించుకోవాలి.

మూలతలంపు మూలంలో నారాయణుడు ఉన్నాడు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి వాక్కును, ప్రాణమును, మనస్సును నిరోధించాలి. నీకు లోచూపు కలగాలి. బాహ్యముఖం అవుతున్న మనస్సును లోపలకు పంపటానికి సాధన చేయాలి. మనస్సు బయటకు వెళ్ళినపుడు దానిని వదలివేయకూడదు. అది ఎన్నిసార్లు బయటకు వెళ్ళినా అన్నిసార్లు ప్రయత్నించి దానిని లోపలకు తీసుకొనిరావాలి. అలా ప్రాక్టీసు చెయ్యాలి. దాని పని అది మానసప్పడు

నీపని నీవుకూడా మానవద్దు. నీకునిగ్రహం ఉంటే, బరువు ఉంటే హృదయంలోనికి వెళ్ళగలవు. కొంతమంది లోపల కపటం పెట్టుకొని ఎదుటి వారిని విమర్శిస్తూ ఉంటారు. నీలో కపటం పెట్టుకొని ఎదుటివారిని విమర్శించటం ఎందుకు? నీలో ఉన్న కపటం నీవు అంగీకరించటంలేదు. ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? నీవు ఏ మార్గంలో అయినా ప్రయాణించు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళకుండా నీకు ఆత్మజ్ఞానం కలిగే సమస్యేలేదు. అందువలన మూలతలంపు మూలంలోనికి వెళ్ళాలి. కోరికలు పెరుగుతూ ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. పేచీలు ప్రారంభమవుతాయి. కోరికలు ఎక్కువఉన్న చోట పేచీలుఎక్కువ ఉంటాయి. నీవుస్వార్థం లేకుండా పనిచేయటం నేర్చుకో. స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే అదేయోగం. అప్పుడు దేహగతమైన నేను దాని అంతట అదే నశిస్తుంది. నీవు పవిత్రుడవు అవ్వటానికి కర్మయోగం అవసరం. నీకు అనేక తలంపులు వస్తున్నాయి. ఈతలంపులు అన్నీ వేరుతో సహానశించే వరకు విచారణ చేయవలసిందే. ఆశ్రమంలో ఉండటం అంటే సోమరితనంగా ఉండటంకాదు. ఇంట్లో అయితే నీకోసం పనిచేసుకొంటావు ఆశ్రమంలో యితే పదిమంది బాగుకోసం పనిచేయాలి, నిన్ను నీవు తెలుసుకోవటానికి కృషిచేయాలి. ఆశ్రమంలో ఉన్నవాడు లోక ఉద్ధరణకు ఎంతోకొంత కృషి చేయాలి, అదేకాలంలో తనను తాను తెలుసుకోవటానికి విచారణ చేయాలి. అంతేగాని సోమరితనంగా ఉండటంకాదు.

మూలతలంపు ఎక్కడ ఉదయించి వస్తోందో అదే హృదయం. అది మన దేహంలో ఒక భాగంకాదు. ఈశ్వరుడు ఎక్కడో ఉన్నాడు అనుకోవద్దు. ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. హృదయలో ఉండి ఈజీవులను నడిపిస్తున్నాడు. మూలతలంపును దానిమూలమైన హృదయంలోనికి పంపితే అక్కడ, దానికి సపోర్టు ఉండదు. అప్పుడు దిక్కులేకుండా పోతుంది. అప్పుడు లోపల ఉన్న సత్యం నీకుస్వరూపంగా వ్యక్తమవుతుంది. దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం. ధనం, పదవులు, ఆస్తులు, గౌరవాలు ఇస్తాము అంటే వద్దని చెప్పేవారు ఉంటారు. కాని సుఖం, శాంతి వద్దని చెప్పేవారు ఈసృష్టిలో ఎవరైనా ఉన్నారా? ఎవరూ ఉండరు. ఎందుచేతనంటే మనస్వరూపమే శాంతి. తనస్వరూపాన్ని వద్దని ఎలా చెపుతాడు. శాంతి బజారులో దొరకదు. అదిమూలతలంపు మూలంలో ఉంది. మూలతలంపు దాని మూలంలోనికి వెళ్ళి నశించినప్పడు శాంతి నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నీవువెదికే వస్తువు నీలోపలేఉంది. లోపల ఉన్న బంగారాన్ని వదిలేసి రోడ్డు మీద ఉన్న పెంకు ముక్కలను ఏరుకొంటున్నాము.

05-05-2002



బంధంగురించి, మోక్షం గురించి ఆలోచించేది నీమనస్సే. లోపల ఉన్న వస్తువుకు బంధంలేదు, మోక్షంలేదు. అది నీవై వున్నావు. అది తానుగా నీకు వ్యక్తమయినప్పడు బంధంలేదు, మోక్షం లేదు. నేనుబంధంలో వున్నాను అని అనుకొంటున్నావు కాబట్టి మోక్షాన్ని కోరుకుంటున్నావు. మనబంధానికి కారణం అజ్ఞానం. మూలతలంపు నశించేవరకు అజ్ఞానం నిన్ను వెంటాడుతుంది. మూలతలంపు ఉన్నంతవరకు నీవు పాపరహితుడవు, దుఃఖరహితుడవు అవ్వలేవు. ఇప్పడు నీదేహం ఆరోగ్యంగానే ఉండవచ్చు. కాని దానికి ఎప్పడైనా రోగం రావచ్చు. రోగం రాదు అని చెప్పలేము. అలాగే మూలతలంపు ఉన్నంతకాలం నీవుపాపంచేయవచ్చు, దోషం చేయవచ్చు. మూలతలంపు ఉన్నంత కాలం నీవుపాపరహితంగా, దుఃఖరహితంగా , దోషరహితంగా ఉండలేవు. నీవు Sinless state, Sarrowless state పొందాలంటే మూలతలంపు మూలంలోనికి వెళ్ళవలసిందే. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించి మూలతలంపును తొలగించుకో. మూలతలంపును ఉంచుకొని దుఃఖరహితస్థితిని పొందటం సాధ్యంకాదు. మూలతలంపు ఉన్నంతకాలం అది నానాపెంట తెచ్చిపెడుతుంది. మంచిలోకాలకు వెళ్ళాలి అనిచెప్పేది మూలతలంపే. భోగాలు అనుభవించాలి అనేది మూలతలంపే. నువ్వు సాధన బాగా చేస్తున్నావు. మంచిదే, అయితే నీవు కాని దానిని నీవు అనుకోవటం మానివేసావా? లేదు. ఇంక సాధన ఎందుకు? నిన్ను ఎవరైనా అగౌరవపరిస్తే బాధపడుతున్నావా? లేదా? నీకు బాధ కలుగుతోంది. ఇంక నీవు చేసే సాధన ఎందుకు? మూలతలంపు కొంతమందితో స్నేహం చేస్తుంది. కొంతమందితో విరోధం పెట్టుకొంటుంది. ఇలా ఎన్నో ప్రయత్నాలు చేసి అది బయటకు వచ్చేస్తుంది.

రూపం ఉన్న దేవుడిని ఆరాధించమంటారా? రూపంలేని దేవుడిని ఆరాధించమంటారా? అని అడుగుతున్నాడు. అసలు ఆరాధించటం మొదలుపెట్టు. ఎలా చేసినా ఆయనకే చెందుతుంది. నీకు ఏది ఇష్టమైతే అదిచెయ్యి. ఆరాధించటం మానివేసి ఈతర్కాలవలన కాలం వృధా అవుతుంది. స్నేహితులు అని, విరోధులని ఇలా మనస్సు ఏదో ఒకటి పట్టుకొని ఉంటుంది. నామిత్రుల దగ్గర నుండి నన్ను కాపాడు అని ఒక పాండురంగ భక్తుడు అడుగుతాడు. శత్రువులు నాదగ్గరకురారు, నాకాలం వృధా చేయరు. మిత్రులు నాకాలం అంతా తినేస్తున్నారు. అందువలన నా మిత్రుల నుండి నన్నుకాపాడు అని అడిగాడు.

ఏ పనిచేసినా చిత్తశుద్ధితో చెయ్యి, హృదయపూర్వకంగాచెయ్యి. కొంతమంది మాటలో, పనిలో హృదయస్పందన ఉంటుంది. నీవు ఏపనిచేస్తున్నావు, అది పెద్దపనా, చిన్నపనా, అని

భగవంతుడు చూడడు. ఆపని నీవు ఏ ఉద్దేశంతో చేస్తున్నావు అనేది భగవంతుడు చూస్తాడు. రూపబుద్ధి, నామబుద్ధి మనలను బంధిస్తున్నాయి. ఇవే మనలను పాడుచేస్తున్నాయి. వీటిలో నుండి విడుదల పొందకుండా నీవు దు:ఖరహితస్థితిని పొందలేవు. నీవు ఒక్కక్షణంకూడా వృధాచేయవద్దు. వ్యర్థమైన తలంపులతో నీ టైము పాడుచేసుకొంటున్నావు. కొంతమంది స్నేహితులతో కాలక్షేపం కబుర్లు చెప్పకొంటూ, కొంతమంది విరోధులపై ఎలా పగసాధించాలి అని ఆలోచిస్తూ ఇలా కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చామో మర్చిపోతున్నాము. మనకు మరణసమయం వచ్చినప్పడు భగవంతుడు ఒక్క క్షణం కూడా ఆపడు. ఎంతపెద్ద డాక్టరుకు అయినా మనరోగం అర్థంకాదు. అక్కడఉన్నవాడు కూడా ఈశ్వరుడే. ఆసమయంలో డాక్టరుకు అర్థంకానివ్వడు. చనిపోయిన తరువాత ఆరోగం గురించి తెలుస్తుంది. ఇద్దరు కూర్చొంటే వారిలో ఉన్నలోపాలు చూసుకోరు. ఇతరుల లోపాలగురించి మాట్లాడుకొంటారు. అసలుమీకు ఆహక్కు ఎక్కడిది అంటారు భగవాన్. ఇటువంటి వ్యర్థమైన మాటలతో కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. స్వార్థంలేని కర్మ కొంచెం చేసినా దానిని వంపు పెట్టుకొని నిన్ను రక్షిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. స్వార్థం ఉన్నవాడు తన స్వార్థంకోసం ఎలా పని చేస్తాడో ఆశ్రమంలో ఉన్నవాడు ఇతరుల క్షేమంకోసం అలాపనిచేయాలి. నీవు సహజంగా, నిర్మలంగాజీవించు. నాలో ఏదో గొప్పతనం ఉంది అని అనుకోవద్దు. అలా అనుకొంటూఉంటే అది జ్ఞానంకాదు, అది రోగం. దానికి మందు వాడు. చిత్తశుద్ధితో జీవిస్తూఉంటే సందేహం లేకుండా, నిశ్చయంగా నీకులోపల ఉన్న వస్తువు వ్యక్తమవుతుంది. నీ మనస్సునిండాకపటం పెట్టుకొని ఎదుటివాడిలో కపటంఉంది అని చెప్పటానికి ఆ హక్కు ఎవడు ఇచ్చాడు. ఆ మాట అనటానికి నీవు పనికిరావు.

మూలతలంపుకు పుట్టిల్లు హృదయం, అత్తవారి ఇల్లు శిరస్సు. దానిని అత్తవారి ఇంటివద్ద ఉంచకుండా సాధ్యమైనంతవరకూ పుట్టింటివద్ద ఉంచటానికి చూడండి. ఆత్మను తెలుసుకోవటం ఎలాగఅని అడుగుతున్నారు. దేహం, మనస్సుతెలుస్తున్నాయి. ఆత్మగురించి తెలియటంలేదు దానిని తెలుసుకోవటం ఎలాగ అంటున్నారు. నీ ఆత్మను నీవే కనుక్కో అంటున్నారు భగవాన్. అది బయటలేదు, నీ లోపలే ఉంది, నీవే కనుక్కోవాలి. ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మను తెలుసుకోవాలి అంటున్నావు. తెలుసుకోవాలనేవాడిని తీసెయ్యి అప్పడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. ఆత్మ తెలియటంలేదు అంటున్నావు. తెలియటం లేదు అని చెప్పే నేనును తీసివెయ్యి. ఆత్మ గొడవవదిలి వెయ్యండి. నేను ఎందుకు పుట్టాను అంటున్నాడు? పుట్టింది ఎవరు అంటున్నారు భగవాన్. నీవు పుట్టలేదు. శరీరం పుట్టింది. అదినీవుకాదు. ఈ పుట్టింది ఎవరు అని విచారణచేస్తే పుట్టని వస్తువు గురించి నీకు తెలుస్తుంది. నిన్ను నీవు తెలుసుకోవటానికే ఈ లోకంలోనికి వచ్చావు. నీవు గుడులుచుట్టూ తిరిగినా, ఎంతసాధన చేసినా అహంభావరహితస్థితివచ్చేవరకు నీకు దు:ఖరహితస్థితి, పాపరహితస్థితిరాదు. అహంభావరహితస్థితి పొందటానికి మరణం వచ్చేవరకు మనం ఆగనక్కరలేదు. గాఢనిద్రలో మనం అహంభావరహిత స్థితిలోఉన్నాము. ప్రయత్నంచేసి జాగ్రదవస్థలో దానిని సంపాదించుకో. గాంధీగారు మహాత్ముడు అవ్వటానికి ఒకటేకారణం. ఒకమంచిపనికోసం దేహం ఇచ్చేయటానికి ఎప్పడూ సిద్దంగా ఉండేవాడు. దేహానికి ఆయన ప్రాముఖ్యత ఇవ్వలేదు. అది అపూర్వం. మనపరిస్థితి ఎలా ఉంది అంటే ఎంతసేపు ఈ దేహానికి కావలసిన కంఫర్టు చూడటం, ఈ దేహాన్ని ముస్తాబు చేయటం సరిపోతోంది. హనుమంతుడు మహాబలవంతుడు. పాండిత్యం, శక్తి, సౌందర్యం అన్నీ ఉన్నప్పటికీ ఆయన అణిగిఉన్నాడు. అందులో ఏదీ మనకు లేదు కాని ఎగిరిఎగిరి పడుతున్నాము. అంటే మనకు తూకంలేదు. తూకంవచ్చినప్పడు మనకు లోచూపు కలుగుతుంది. అప్పడులోపలఉన్న వస్తువు మనకు వ్యక్తమవుతుంది.

## శ్రీ నాన్నగాయత్రి

**అరుణాచలాయ విద్మహే**
**రమణభక్తాయ ధీమహి**
**తన్నో నాన్నః ప్రచోదయాత్**

**దండు సత్యనారాయణరాజు**
రిటైర్డు హైస్కూల్ హెడ్‌మాష్టారు

05-05-2002

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 2-5-02 నుండి 13-5-02 | | విశాఖపట్నం కాంపు |
| 07-5-2002 | మంగళవారం | విశాఖపట్నం సీతమ్మదార క్షత్రియ కళ్యాణమండపము |
| 19-5-2002 | ఆదివారం | జిన్నూరు శ్రీరమణ క్షేత్రంలో |
| 23-5-2002 | గురువారం | నార్నిమెరక (వయా) మట్లపాలెం |
| 27-5-2002 | సోమవారం | పాలకోడేరు, షిరిడి సాయిబాబాగుడి, హైస్కూల్ దగ్గర |


## శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవము




ప॥గో॥జిల్లా గుడ్డుగుడెం భక్తుల ఆహ్వానం మేరకు సద్గురు శ్రీ నాన్నగారు ది. 20-4-2002 సాయంత్రం గుడ్డుగుడెం చేరుకున్నారు. భక్తుల తరఫున వెంకటరామరాజుగారు వారి ధర్మపత్ని భారతిగారు సద్గురు శ్రీనాన్నగారికి స్వాగతం పలికినారు. గుడ్డుగుడెం భక్తులు సద్గురు శ్రీనాన్నగారి దర్శనం చేసుకొన్నారు.

ది. 21-04-2002 ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన ఉదయం గం॥ 10-54 ని॥లకు ప॥గో॥జిల్లా గోపాలపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడి సాయిబాబా వారి దేవాలయంలో సద్గురు శ్రీనాన్నగారు శ్రీ షిరిడి సాయిబాబావారి విగ్రహ ప్రతిష్ట గావించినారు.

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు



50-28-22, టి.పి.టి. కోలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం - 530 013
రిజిష్టర్డు నెం. 10/2002 ☎ (O) 792346, 551265, (R) 552141

గౌరవ ట్రస్టీ : **సద్గురుశ్రీనాన్నగారు**
మేనేజింగ్ ట్రస్టీ : **శ్రీ పి.ఎస్.ఎన్.రాజు**






ది. 14-3-2002 న జిన్నూరు శ్రీరమణక్షేత్రంలో **సద్గురు శ్రీ నాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు** లాంఛనప్రాయంగా సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభించినారు. జిన్నూరు గ్రామసర్పంచ్ మరియు వార్డుమెంబర్స్ ఏర్పాటుచేసిన ఈసభలో కులవిభేదం లేకుండా 21 మంది నిరాధారులైన వృద్ధులకు నెలవారీ పెన్షన్ రు.75/-లు ఇచ్చినారు. ఈసభకు విచ్చేసిన పలువురు ప్రముఖులు సుమారు రు. 1,00,000/- లు విరాళాలు ప్రకటించినారు. ది. 30-3-02 న పాలకొల్లు సరస్వతి నగర్‌లో సరస్వతి శిశుమందిర్‌కు సద్గురు శ్రీ నాన్నగారు శంకుస్థాపన చేస్తూ ఈట్రస్టు ద్వారా విరాళం ప్రకటించినారు. ఇటువంటి ఎన్నో సేవాకార్యక్రమాలు చేసేఉద్దేశంతో ఈట్రస్టు ఏర్పాటు చేయబడినది.

**పి.ఎస్.ఎన్. రాజు,**
మేనేజింగ్ ట్రస్టీ